# పోలింగ్@83%

- హుజూరాబాద్ నియోజకవర్గంలో గతంలో కన్నా తగ్గిన పర్సెంటేజీ
- వీణవంక మండలం బ్రహ్మణపల్లిలో అత్యధికం



హుజూరాబాద్ పట్టణ పరిధిలోని ఇందిరానగర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు(ఫైల్)


హుజూరాబాద్, డిసెంబర్ 1: 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఇప్పుడు నియోజకవర్గంలో పోలింగ్ శాతం స్వల్పంగా తగ్గింది. 2018 హుజూరాబాద్ నియోజకవర్గానికి జరిగిన సాధారణ ఎన్నికల్లో 84 శాతం ఓటింగ్ కాగా, ప్రస్తుతం 83.19శాతం నమోదైంది. గతంతో పోల్చుకుంటే 0.81శాతం తక్కువగా పోలింగ్ జరిగింది. 2018 జరిగిన ఎన్నికల్లో మొత్తం పదిమంది బరిలో ఉండగా, బీఆర్ఎస్ విజయం సాధించింది. ప్రస్తుత ఎన్నికల్లో 22మంది పోటీలో ఉండగా, ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్ మధ్య పోటీ నెలకొంది. నియోజకవర్గంలో మొత్తం 2,49,558 ఓటర్లకు గాను 2,07,709 ఓట్లు నమోదు కాగా, పురుషులు లక్షా 2,194, స్త్రీలు లక్షా 5,418 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, ఇతరులు ఐదుగురిలో ముగ్గురు ఓటు వేశారు. విశేషమేటంటే మొత్తం ఓటర్లలో స్త్రీల ఓట్ల శాతం ఎక్కువ ఉండగా... ఇవే కీలకం కానున్నాయి. అయితే ఓటు హక్కును వినియోగించుకోవడంలో స్త్రీలు మాత్రం వెనుకంజలో ఉన్నారు.

### అత్యధికంగా బ్రహ్మణపల్లిలో...

అత్యధికంగా వీణవంక మండలం బ్రహ్మణపల్లిలో 115 పోలింగ్ కేంద్రంలో 93.28శాతం నమోదైంది. మొత్తం ఓటర్లు 551ఉండగా, 514మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత వీణవంక మండలం ఘన్ముక్లలో 119 పోలింగ్ కేంద్రాల్లో 91.73 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యల్పంగా జమ్మికుంట పట్టణంలోని 179 పోలింగ్ కేంద్రంలో 62.62శాతం నమోదు కాగా, ఆ తర్వాత అదే పట్టణంలోని 181 పోలింగ్ కేంద్రంలో 63.62శాతం నమోదైంది.

# ప్రగతి పథంలో వెన్నంపల్లి

- ప్రభుత్వ సహకారంతో మెరుగుపడిన మౌలిక వసతులు
- వీధివీధినా సీసీరోడ్లు.. ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు



వెన్నంపల్లి గ్రామం

సైదాపూర్, డిసెంబర్ 1: మండలంలోని వెన్నంపల్లి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నది. ప్రభుత్వం దశలవారీగా ఇచ్చిన నిధులతో గ్రామం ప్రగతి పథంలో నడుస్తున్నది. వెన్నంపల్లి 2022 సంవత్సరంలో సంసద్ ఆదర్శ్ గ్రామీణ్‌యోజనలో దేశంలో ప్రథమస్థానంలో నిలిచింది. గ్రామ సర్పంచ్ అబ్బిడి పద్మారవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని పాలకవర్గం ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంతోపాటు పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతున్నది. గ్రామంలో విద్యుత్ సమస్య ఉండడంతో సుమారు రెండు రూ.కోట్లతో గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మించి సమస్య పరిష్కరించారు. ప్రభుత్వం ద్వారా 32లక్షల రూపాయలు మంజూరు కాగా, నూతన గ్రామపంచాయతీని నిర్మించుకున్నారు. అంతర్గత రహదారుల కోసం ప్రభుత్వం నుంచి సుమారు కోటీ రెండు లక్షల రూపాయలు మంజూరు కాగా, వాటితో సీసీరోడ్లు నిర్మించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఏడు విద్యుత్ హైమాస్ట్‌లైట్లను ఏర్పాటు చేసుకున్నారు. 20 లక్షల రూపాయలు పల్లె దవాఖానకు మంజూరు కాగా, పనులు ప్రారంభమయ్యాయి. 5లక్షల రూపాయలతో కల్వర్టుల నిర్మాణాలు జరిగాయి. రూ.6లక్షలతో మిషన్‌భగీరథ ఇంటర్నల్ వర్క్ పూర్తయింది. కాగా, ఎస్సీకమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5లక్షలు, అంబేద్కర్ కమ్యూనిటీహాల్ బ్యాలన్స్ వర్క్‌కు 2లక్షల రూపాయలు మంజూరయ్యాయి.



గ్రామంలో వేసిన సీసీరోడ్డు

### ఎమ్మెల్యే సహకారంతోనే గ్రామాభివృద్ధి



హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరం. గ్రామంలో అవసరమైన సీసీరోడ్లు వేశాం. గ్రామంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తున్నాం.

- అబ్బిడి పద్మారవీందర్‌రెడ్డి, వెన్నంపల్లి సర్పంచ్




వెన్నంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

# విపక్షాల కుట్రలను ప్రజలు తిప్పి కొట్టారు

- చివరిగా నమోదైన పోలింగ్ శాతంతో బీఆర్ఎస్‌కు మెజార్టీ
- బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి



మాట్లాడుతున్న రావుల రాజలింగారెడ్డి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 1: ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ఓటర్లు మాత్రం బీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌కు అండగా నిలిచారని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఓటమి భయంతో బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఎన్నికలు ముగిసిన తర్వాత అధికార పార్టీపై ఆరోపణలకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు. డబ్బులు, మద్యం పంచింది బీజేపీ, కాంగ్రెస్ వాదులేనని, సాయంకాలం వరకు ఓటర్లను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవాలని కుట్ర చేస్తే ప్రజలు ఒక్కసారిగా పోలింగ్ సెంటర్లకు వెళ్లి తమ వ్యతిరేకతను ఓటు రూపంలో కాంగ్రెస్, బీజేపీలకు చూపించారన్నారు. బీజేపీ అభ్యర్థి ఈటల మేక వన్నే పులిలా వ్యవహరించి, మళ్లీ దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా నీతులు చెప్పడం సరికాదన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఓటమి భయంతోనే సాయంత్రం పలు పోలింగ్ కేంద్రాల వద్ద బీజేపీ నాయకులు నిస్సిగ్గుగా డబ్బులు పంచారని ఆరోపించారు. ఎలాగైనా గెలవాలని అడ్డదారులు తొక్కింది వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు..? బీజేపీ కొన్ని మీడియా చానళ్లు, సోషల్ మీడియాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసిపోయాయని దుష్ప్రచారం చేసి ఈ ఎన్నికల్లో లబ్ధి పొందాలని భారీ కుట్రకు తెర లేపిందని ఆరోపించారు. అధికార పార్టీపై కాంగ్రెస్, బీజేపీ నేతలు విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమో ప్రజలు ఆలోచించాలన్నారు. సాయంకాలం పెరిగిన పోలింగ్ శాతంతో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఖాయమని, గెలుపుపై నమ్మకం ఉంటే బీజేపీ నాయకులు ఫేక్ వార్తలు ఎందుకు ప్రచారం చేస్తున్నారు, కౌంటింగ్ వరకు ఎందుకు ఆగడం లేదు? అని రాజలింగారెడ్డి ప్రశ్నించారు. రేపు బీజేపీకి దిమ్మ తిరిగే తీర్పు ప్రజలు ఇవ్వబోతున్నారని, హుజూరాబాద్ నియోజకవర్గంలో ఏడుసార్లు గెలిచిన ఈటల ఇక రాజకీయ సన్యాసం తీసుకోవాల్సి వస్తుందనే అసహనంతోనే తన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

# తెలంగాణ అమరుడు కిష్టయ్యకు ఘన నివాళి



వీణవంకలో కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వీణవంక, డిసెంబర్ 1: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మల్లారెడ్డిపల్లి గణేశ్ కళా బృందం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన తెలంగాణ కోసం చేసిన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో కళాబృందం వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మయ్య, అధ్యక్షుడు రాయనవేన తిరుపతి, నాయకులు పెద్దులు, సమ్మయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో 84.66శాతం పోలింగ్

హుస్నాబాద్, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో 84.66 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 83.61 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,42,177మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,19,757 మంది ఉండగా, మహిళలు 1,22,416 మంది ఉన్నారు. గురువారం జరిగిన పోలింగ్‌లో మొత్తం ఓటర్లలో 2,05,017మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 1,01,937 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకోగా 1,03,079 మంది మహిళలు ఓటు వేశారు. ఒక ట్రాన్స్‌జెండర్ కూడా తన ఓటును వేసింది. పురుషులు 85.12శాతం ఓటు వేయగా మహిళలు 84.20శాతం ఓటు వేశారు.

చిగురుమామిడిలో 33,175మంది ఓటర్లకు 27,820మంది ఓటు వేశారు. ఇక్కడ 83.86శాతం పోలింగ్ అయింది. సైదాపూర్ మండలంలో మొత్తం 31,877మంది ఓటర్లు ఉండగా ఇందులో 27,132మంది ఓటు వేయగా 85.11శాతం పోలింగ్ నమోదైంది. భీమదేవరపల్లిలో 37,616మంది ఓటర్లకు గాను 30,919మంది ఓటు వేయగా 82,20శాతం పోలింగ్ అయింది. ఎల్కతుర్తి మండలంలో 31,726మంది ఓటర్లు ఉండగా ఇందులో 27,525మంది ఓటు వేశారు. ఇక్కడ 86.76శాతం పోలింగ్ నమోదైంది.

### కొద్దిపాటి మెజార్టీతోనే విజయం

నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాల్లో గత అసెంబ్లీ ఎన్నికలకంటే ఈసారి ఎక్కువ శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. ఎక్కువశాతం పోలింగ్ అనేది ఎవరికి అనుకూలమనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పోటాపోటీగా జరిగిన ఈ పోరులో కొద్దిపాటి మెజార్టీతోనే అభ్యర్థులకు విజయం దక్కే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగినందున బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఉండే అవకాశం కనిపిస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## కారు ఢీకొని యువకుడి మృతి

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 1: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ఇర్కాన్ కంపెనీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తుమ్మనపల్లి గ్రామానికి చెందిన ముప్పు రమేశ్(30) హుజూరాబాద్ నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనం మీదుగా వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారుఢీ కొన్నది. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

## ‘బీఆర్ఎస్‌కే ప్రజామద్దతు’

సైదాపూర్, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ప్రజామద్దతు ఉంటుందని సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కొండ గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## ‘ఎన్నికల్లో ముందంజలో బీఆర్ఎస్’

బెజ్జంకి, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ రాష్ట్రంలో ముందంజలో ఉందని, ఎగ్జిట్ పోల్స్‌పై నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని మెజార్టీలో ముందంజలో నిలిపేందుకు పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.